రాఖీ సందడి..!




సండే స్పెషల్

- జిల్లాలో పెద్దఎత్తున వెలిసిన రాఖీ దుకాణాలు
- మార్కెట్లోకి ఏటా కొత్త రకం రాఖీలు
- కొనుగోళ్లతో కళకళలాడుతున్న దుకాణాలు
- వెరైటీ రాఖీలతో ఆకట్టుకుంటున్న షాపులు

మంచిర్యాలటౌన్: రక్షాబంధన్ పండగ సందడి మొదలైంది. ఈ నెల 19వ తేదీన రాఖీ పండుగ పురస్కరించుకొని జిల్లాలో వారం రోజుల ముందు నుంచే ఆడపడుచులు ఉత్సాహంగా రాఖీలు కొనుగోలు చేయడం మొదలుపెట్టారు. అందుకు తగినట్లుగా వివిధ ఆకృతుల్లో కనువిందు చేస్తున్న రాఖీలకు గిరాకీ బాగా పెరిగింది. చూడచక్కని రాఖీలను అమ్ముతున్న దుకాణాల ఎదుట జనం బారులు తీరుతున్నారు. హోల్‌సేల్, రిటైల్ దుకాణాల్లో కళ్లు చెదిరే డిజైన్లతో ఉన్న రాఖీలను అమ్ముతున్నారు. ఒక్కో రాఖీ రూ.10నుంచి రూ. 500ల వరకు ఉన్నాయి. వెండి, ప్లాస్టిక్ రాఖీలు, చిన్న పిల్లలను ఆకర్షించేందుకు చోటా భీమ్, బాల్ గణేష్, డోరిమాన్, చిం చ్యాన్, టామ్ అండ్ జెర్రీలతో పాటు, కారు, బైక్, సైకిల్ బొమ్మలతో కూడినవి, విమానం, విజిల్ వేసేలా, చిన్నారులకు వాచీ ఆకారంలో ఉండేలా రాఖీలు మార్కెట్లో లభిస్తున్నాయి. చిన్నారుల కోసం ఎన్నో రకరకాల రాఖీలు ఆకట్టుకుంటున్నాయి. మహిళలు, యువతులు, మంచి డిజైన్లలో ఆకట్టుకునేలా ఉండే రకరకాల రాఖీలను కొనేందుకు ఆసక్తి చూపుతున్నారు. వీటితో పాటు బహుమతులు కొనేందుకు ప్రజలు దుకాణాలకు చేరుకోవడంతో, మార్కెట్లో సందడి నెలకొంది.

ఏటా ఆకట్టుకునేలా రాఖీలు..

ఏటా మార్కెట్లోకి ప్రజలను ఆకర్షించేలా రాఖీలను వ్యాపారస్తులు తెచ్చి, ప్రజలు కొనేలా చేస్తున్నారు. గతంలో చిన్నపాటి పరిమాణంలో దూది, ప్లాస్టిక్‌తో తయారు చేసిన హంస, స్వస్తిక్, నెమలి ఈకలు, నాణేలు, నోట్ల రూపాల్లో రాఖీలు తయారు చేసేవారు. ఇప్పుడు రకరకాల డిజైన్లతో మార్కెట్లో రాఖీలు దర్శనమిస్తున్నాయి. వివిధ వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ధారం, దూది మొదలుకొని వెండి, బంగారు రేకులతో తయారు చేసిన రకరకాల రాఖీలు మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి. ఏటా రాఖీల ధరలు పెరుగుతున్నా, అన్నాచెల్లెళ్ల ఆత్మీయత ముందు పెరిగిన ధరలు ప్రభావం చూపడం లేదని వ్యాపారస్తులు పేర్కొంటున్నారు. ప్రత్యేక కిట్‌లతో కూడిన రాఖీలు ప్రస్తుతం మార్కెట్లో లభిస్తున్నాయి. ఇతర దేశాలకు, దూర ప్రాంతాలకు రాఖీ కిట్‌లను ఎక్కువగా పంపుతుండడం సంప్రదాయంగా కొనసాగుతుంది. ఈ కిట్‌లలో రెండు రాఖీలు, కుంకుమ బొట్టు, పసుపు, అక్షింతలు, చాక్లెట్, జీడిపప్పులు ఉంటాయి. వెండి కోటెడ్ మంగళహారతి పళ్లెం రూపంలో కూడా ఉన్నాయి. ఈ కిట్ ధర రూ.300 నుంచి రూ.1000 వరకు ఉంటుంది. వినియోగదారులను ఆకట్టుకునేందుకు ఆకర్షణీయమైన రాఖీలను హైదరాబాద్, బెంగళూర్, మహారాష్ట్ర, పూణె, రాజస్థాన్ ప్రాంతాల నుంచి తెప్పిస్తున్నట్లు వ్యాపారులు తెలిపారు.

గిరాకీ బాగుంది..



రాఖీ పండుగ వచ్చిందంటే ప్రతి ఆడపిల్లా తన సోదరులకు రాఖీని కట్టేందుకు గాను ఏటా వెరైటీ రాఖీలు మార్కెట్లోకి వస్తున్నాయి. ఎన్ని కొత్త రకం రాఖీలు వచ్చినా, అంతే డిమాండ్ వాటికి పెరుగుతుంది. రూ.10నుంచి రూ.400కి పైగా ఉన్న రాఖీలు ఎక్కువగా అమ్ముడు పోతున్నాయి. రాఖీలను ధరలతో పోల్చకుండా, అవి ఎంత బాగా ఉన్నాయో వాటిని వెతికి మరీ కొనుగోలు చేస్తున్నారు. వరుసగా సెలవులు రావడం కూడా రాఖీలను కొనుగోలు చేసేందుకు ప్రజలు ఉదయం నుంచి సాయంత్రం వరకు వస్తూనే ఉన్నారు.

– లత, షాప్ యజమాని, మంచిర్యాల



రాఖీలు కొనుగోలు చేస్తున్న మహిళలు



మార్కెట్లో రాఖీలు



రాఖీలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

క్లుప్తంగా

పాఠశాల సందర్శన



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో

చెన్నూర్‌రూరల్: మండలంలోని ఆస్నాద గ్రామంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలను శనివారం డీఈవో యాదయ్య తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఆయనకు బొకే ఇచ్చి స్వాగతం పలికారు. పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు శాతాన్ని, సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థులను ప్రశ్నలు అడుగుతూ సమాధానాలు రాబట్టారు. మంచిగా చదువుకొని తల్లిదండ్రులు, పాఠశాలకు పేరు తీసుకురావాలన్నారు. మధ్యాహ్న భోజనం సక్రమంగా అమలువుతుందా.. లేదా అని తెలుసుకున్నారు. విద్యార్థుల హాజరు శాతం, విద్యా నైపుణ్యాలను పెంచాలని ఉపాధ్యాయులకు సూచించారు.

'హర్‌ఘర్ తిరంగా'పై అవగాహన

మంచిర్యాలటౌన్: మంచిర్యాల పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ 1, యూనిట్ 2 ఆధ్వర్యంలో శనివారం హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి, ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆర్.పాండురంగ శర్మ, వైస్ ప్రిన్సిపాల్ సునిత, ఎన్ఎస్ఎస్ యూనిట్ 1 ప్రోగ్రాం అధికారి కె.రజిత, యూనిట్ 2 ప్రోగ్రాం అధికారి ఎం.జ్యోతి పాల్గొన్నారు.

అర్హులకు రుణమాఫీ అమలు చేయాలని ధర్నా



రోడ్డుపై బైఠాయించిన బీఆర్ఎస్ నాయకులు

నెన్నెల: వంద శాతం రుణమాఫీ జరిగిందని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం లక్షల మంది రైతులకు రుణమాఫీ ఇవ్వకుండా మోసం చేసిందని, అందరికీ రుణమాఫీ చేయాలంటూ బీఆర్ఎస్ నాయకులు రైతులతో కలిసి శనివారం నెన్నెల టీ రోడ్డు వద్ద బైఠాయించి ధర్నాకు దిగారు. రూ.2 లక్షల రుణమాఫీ సంపూర్ణంగా జరగకపోతే రైతుల పక్షాన ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మేకల మల్లేష్, ప్రతాప్‌రెడ్డి, రాంచందర్, ఇబ్రహీం, చీర్ల మొండన్న, అశోక్‌గౌడ్, శ్రీనివాస్, బాపు తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ ఇక్కట్లు



తాండూర్/కోటపల్లి: తెలంగాణ ప్రభుత్వం రైతు రుణమాఫీ కోసం ఆగస్టు 15 వరకు రూ.2లక్షల రుణమాఫీ చేయగా తాండూర్, కోటపల్లి మండలాల్లో చాలా మంది రైతులు శనివారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల కార్యాలయాల్లో బారులు తీరారు. చాలా వరకు రైతులకు సరైన సమాదానం లేక కార్యాలయంలో అధికారులను సంప్రదించి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఏది ఏమైనా రూ.2లక్షల రుణమాఫీ మాత్రం అధికారులకు లబ్ధిదారుల ప్రశ్నలు చుక్కలు చూపించాయి.

'విధులకు హాజరవుతాం'

మంచిర్యాలటౌన్: ఇటీవల బెల్లంపల్లిలోని యూపీహెచ్‌సీ శంశీర్‌నగర్‌లో పనిచేస్తున్న ఆశవర్కర్ సమ్మక్కను పబ్లిక్ హెల్త్ మేనేజర్ రికార్డులు, రిపోర్టుల విషయంలో ఇబ్బందులకు గురిచేసి, అసభ్య పదజాలంతో దూషించగా, ఆశవర్కర్ ఆత్మహత్యాయత్నం చేసిందంటూ విధులను బహిష్కరించిన ఆశ కార్యకర్తలు తిరిగి విధులను నిర్వర్తిస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ గ్రామీణ ఆరోగ్య కార్యకర్తల సంఘం(బీఆర్‌టీయూ అనుబంధం) జిల్లా కార్యదర్శి వాణి, లీల, శ్రీలత, యశోద, సునీతలు ఇటీవల ఆశ కార్యకర్తకు న్యాయం చేయాలని డీఎంహెచ్‌వోకు వినతిపత్రం ఇవ్వగా, హెల్త్ మేనేజర్‌ను జిల్లా వైద్య ఆరోగ్య శాఖకు అటాచ్ చేస్తూ డీఎంహెచ్‌వో ఉత్తర్వులు జారీ చేశారని, ఆశకు కొంత వరకు న్యాయం జరిగిందని తెలిపారు. ఆశలు విధులకు హాజరై, ఇబ్బందులకు గురైన ఆశకు పూర్తిస్థాయిలో న్యాయం చేసే వరకు విధులకు హాజరై పోరాటం చేస్తామని పేర్కొన్నారు.

కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

రామకృష్ణాపూర్/మందమర్రిరూరల్: రామకృష్ణాపూర్ పట్టణంలోని రాజీవ్‌చౌక్‌లో, మందమర్రి పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద శనివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేయటం సరికాదని పేర్కొంటూ నిరసన చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తే జీర్ణించుకోలేని బీఆర్ఎస్ నాయకులు ఇష్టారీతిన మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కార్యక్రమాల్లో క్యాతనపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ, పార్టీ పట్టణ అధ్యక్షుడు పల్లెరాజు, రఘునాథ్‌రెడ్డి, గోపతిరాజయ్య, వొడ్నాల శ్రీనివాస్, సాగర్‌రెడ్డి, యాకూబ్ అలీ, కాంగ్రెస్ పార్టీ, అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ముందస్తు రక్షాబంధన్



భీమారంలోని అంగన్‌వాడీ కేంద్రంలో...



దండేపల్లి: రాఖీలు కట్టుకుంటున్న విద్యార్థులు



నస్పూర్: జెడ్పీ హెచ్ఎస్‌లో చెట్టుకు రాఖీ కడుతూ...

దండేపల్లి/జన్నారం/లక్సెట్టిపేట/భీమారం/నెన్నెల/కాసిపేట/చెన్నూర్‌రూరల్/తాండూర్/నస్పూర్: రాఖీ పండుగను పురస్కరించుకొని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ముందస్తు రాఖీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఒకరికొకరు రాఖీలు కట్టుకుని నీవు నాకు రక్షా, నేను నీకు రక్షా అంటూ రక్షాబంధన్ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. దండేపల్లి మండలం గుడిరేవు జెడ్పీ ఉన్నత పాఠశాలలో, జన్నారం మండలం కలమడుగు వివేకానంద పాఠశాలలో, లక్సెట్టిపేట మండల కేంద్రంలోని లిటిల్‌స్టార్ గ్రామర్, క్రిష్ణవేణి పాఠశాలల్లో, భీమారం మండలం ఇప్పలబొగుడ సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రంలో, చెన్నూర్ మండలం అంగ్రాజ్‌పల్లి గ్రామంలోని వివేకానంద విద్యామందిర్ పాఠశాలలో, నెన్నెల మండల కేంద్రంలోని లోటస్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో, తాండూర్ కస్తూర్బా బాలికల విద్యాలయం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో, దేవాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో వేడుకలు నిర్వహించారు. నస్పూర్ మండలం తీగల్‌పహాడ్ జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులు చెట్లకు రాఖీలు కట్టారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో వైద్యుల నిరసన



దండేపల్లి: నల్లబ్యాడ్జీలతో వైద్యసిబ్బంది నిరసన





మందమర్రిరూరల్: నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన



నెన్నెల పీహెచ్‌సీ ముందు నిరసన



లక్సెట్టిపేట: నిరసన వ్యక్తం చేస్తున్న వైద్యులు



బెల్లంపల్లి: ర్యాలీ చేస్తున్న అనుభవ వైద్యులు

లక్సెట్టిపేట/దండేపల్లి/మందమర్రిరూరల్/నెన్నెల/మంచిర్యాలరూరల్(హాజీపూర్)/బెల్లంపల్లి: కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై అత్యాచారం, హత్య ఘటనకు నిరసనగా ఐఎంఏ పిలుపులో భాగంగా జిల్లా వ్యాప్తంగా వైద్యులు ర్యాలీలు నిర్వహించి, నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ప్రైవేట్ ఆసుపత్రులు మూకుమ్మడిగా బంద్ పాటించారు. దండేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం ఓపీ సేవలు నిలిపివేశారు. పలుచోట్ల వైద్యులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. బాధ్యులపైన కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వైద్యుల రక్షణ కోసం కఠిన చట్టాన్ని రూపొందించి అమలు చేయాలని కోరారు. రాజకీయాలకు తావు లేకుండా విచారణ చేపట్టాలన్నారు. నేరస్తులకు శిక్ష పడకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బాధితురాలి కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.

కొవ్వొత్తుల ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

రామకృష్ణాపూర్: బీజేపీ మహిళా మోర్చ ఆధ్వర్యంలో శనివారం రాత్రి పట్టణంలో కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టారు. కోల్‌కత్తాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన హత్యాచార ఘటనకు నిరసనగా ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చ జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి, వాణిశ్రీ, సరస్వతి, అశోక్, పోషం పాల్గొన్నారు.

విద్యార్థుల నిరసన ర్యాలీ

చెన్నూర్: కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై జరిగిన అమానుష ఘటనను నిరసిస్తూ స్థానిక రైసింగ్ సన్ ఇంగ్లిష్ మీడియం పాఠశాల విద్యార్థులు ప్రధాన వీధుల్లో ఫ్లకార్డులు పట్టుకొని ర్యాలీ నిర్వహించారు. పాశవికంగా దాడి చేసిన దుండగులను శిక్షించాలని విద్యార్థులు నినాదాలు చేశారు. కరస్పాండెంట్ ఖాజాఖంరోద్దిన్, ఉపాధ్యాయులు రవి కిరణ్, రాజేశ్, రఘు, రాజశేఖర్, సంతోశ్, అన్వార్, సునీత, మనిషా, ఉమా, గౌసీయాబేగంలు పాల్గొన్నారు.

19న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ప్రారంభం

బెల్లంపల్లి: బెల్లంపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ఈ నెల 19న ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే గడ్డం వినోద్ తెలిపారు. ఉదయం 11గంటలకు ప్రత్యేక పూజలు చేసి గృహ ప్రవేశం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి అసెంబ్లీ నియోజకవర్గ ప్రజలు, కాంగ్రెస్ శ్రేణులు విధిగా హాజరు కావాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లా కేంద్రంలోని ఏసీసీ 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లోని మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్-1 ఏఈ జాన్ ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 10గంటల నుంచి 11.30వరకు ఏసీసీ సబ్‌స్టేషన్ పరిధిలోని కాలనీలకు అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలన్నారు.

సంక్షిప్త వార్తలు

కార్యవర్గం

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మండల పీఆర్టీయూ కార్యవర్గాన్ని శనివారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఎన్నుకున్నారు. పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు తిరుమల్‌రెడ్డి ఇన్నారెడ్డి, ప్రధాన కార్యదర్శి కొట్టె శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల్లో కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వల్లభ వెంకటేశ్వర్, కార్యదర్శిగా అంకతి మల్లేశ్, అసోసియేషన్ అధ్యక్షుడిగా చక్రపాణి, మహిళా ఉపాధ్యక్షురాలిగా సునీతా దేవి, కార్యదర్శిగా శేఖర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా రవి నిర్వహించారు.

ట్రస్మా ఆధ్వర్యంలో మొక్కల పంపిణీ

శ్రీరాంపూర్: తెలంగాణ రికగ్నైజ్డ్ ప్రైవేట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్(ట్రస్మా) ఆధ్వర్యంలో విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేశారు. శ్రీరాంపూర్‌లోని ఎయిమ్స్ స్కూల్‌లో శనివారం జరిగిన కార్యక్రమానికి ఎస్సై సంతోశ్ ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు పంపిణీ చేశారు.

ఏఈవోల బదిలీ

భీమిని: కన్నెపల్లి మండలంలోని ఇద్దరు ఏఈవోలు శనివారం బదిలీపై వెళ్లారు. జన్కాపూర్ క్లస్టర్ ఏఈవో వెంకటేశ్ కోటపల్లి మండలంలోని దేవులవాడకు, కన్నెపల్లి క్లస్టర్ ఏఈవో వంశీకృష్ణ జన్నారం మండలంలోని చింతగూడకు బదిలీపై వెళ్లారు.

బాధ్యతలు స్వీకరణ

కాసిపేట: మండల వ్యవసాయాధికారిగా చల్ల ప్రభాకర్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంఏవోగా పని చేసిన వందన బదిలీపై మెదక్‌కు వెళ్లగా, లక్సెట్టిపేటలో ఎంఏవోగా పని చేసిన ప్రభాకర్ బదిలీపై కాసిపేటకు వచ్చారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

శ్రీరాంపూర్: కాలనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని శ్రీరాంపూర్ ఎస్సై సంతోష్ తెలిపారు. శ్రీరాంపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కృష్ణ కాలనీలో శనివారం పోలీస్ కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా క్వార్టర్లను తనిఖీ చేశారు. కార్యక్రమంలో భాగంగా 30ద్విచక్ర వాహనాలను, రెండు ఆటోలను సరైన పత్రాలు లేని కారణంగా సీజ్ చేశారు. కార్యక్రమంలో పోలీసులు, కాలనీ ప్రముఖులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం

భీమిని: ఆయూష్ ద్వారా వృద్ధులకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆయూష్ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ రవీందర్ అన్నారు. కన్నెపల్లి మండల కేంద్రంలోని రైతువేదికలో శనివారం ఆయూష్ వైద్యులు సంజయ్‌కుమార్, శ్రీదేవి ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. 80మంది వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.

పదోన్నతి కల్పించినందుకు క్షీరాభిషేకం

మంచిర్యాలఅగ్రికల్చర్: జూనియర్ లైన్‌మెన్లను అసిస్టెంట్ లైన్‌మెన్లగా పదోన్నతి కల్పించినందుకు విద్యుత్‌శాఖ ఐఎన్‌టీయూసీ 327యూనియన్ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రం హైటెక్‌సిటీ కాలనీలోని విద్యుత్ భవన్ వద్ద సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

బొగ్గుబాయి వార్తలు

కలెక్టర్‌ను కలిసిన జీఎం

మందమర్రిరూరల్: ఏరియా జనరల్ మేనేజర్ దేవేందర్ శనివారం మంచిర్యాలలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ కుమార్‌దీపక్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందించారు. ఏరియాలోని సింగరేణి స్థితిగతులను వివరించారు.

ఈపీఆర్ యాప్‌పై అవగాహన కల్పించాలి

శ్రీరాంపూర్: సింగరేణి ఉద్యోగులకు సంబంధించి ఎంప్లాయ్ పర్సనల్ రికార్డ్(ఈపీఆర్)యాప్‌పై ఉద్యోగులకు అవగాహన కల్పించాలని టీబీజీకేఎస్ కేంద్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, బ్రాంచ్ ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి బండి రమేష్, నాయకులు సత్తయ్య, పొగాకు రమేశ్, అన్వేష్ రెడ్డిలు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగులు తమ వివరాలను ఆన్‌లైన్‌లో చూసుకునేలా యాప్‌ను యాజమాన్యం తీసుకురావడం హర్షించదగిందన్నారు. ఉద్యోగులు యాప్‌ను ఎలా వినియోగించాలి, ఇతరులు దీన్ని దుర్వినియోగం చేసుకోకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు.

క్రికెట్‌లో బీ రిలే విజేత



బహుమతి ప్రదానం చేస్తున్న గని మేనేజర్

శ్రీరాంపూర్: ఏరియాలోని ఆర్కే 6 గనిలో స్వాతంత్ర్య వేడుకల్లో భాగంగా అంజనీపుత్ర రియల్ ఎస్టేట్స్ వారి ఆధ్వర్యంలో రెండు రోజులుగా క్రికెట్ పోటీలు నిర్వహించగా, గెలుపొందిన వారికి శనివారం బహుమతి ప్రదానం చేశారు. మొత్తం 4 టీంలు పోటీల్లో పాల్గొనగా బీ రిలే టీం విజేతగా నిలిచింది. గనిపై జరిగిన కార్యక్రమంలో గని మేనేజర్ ఈ తిరుపతి విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. గని రక్షణాధికారి కే శ్రీనివాస్ అధికారులు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ఎస్ఎస్ఎఫ్ చెక్కు అందజేత



చెక్కు అందిస్తున్న మేనేజర్ శ్రీధర్

శ్రీరాంపూర్: ఎస్సార్పీ 3, 3ఏ గనిలో అనారోగ్యంతో మృతి చెందిన ఇప్ప రాజం కుటుంబానికి కంపెనీ సోషల్ సెక్యూరిటీ ఫండ్(ఎస్ఎస్ఎఫ్) డబ్బులను అందజేసింది. గనిపై శనివారం జరిగిన కార్యక్రమంలో మృతుని కుటుంబ సభ్యులకు రూ.62250 చెక్కు రూపంలో గని మేనేజర్ అందించారు. కార్యక్రమంలో గని సంక్షేమ అధికారి ఎస్ఎండీ గౌస్, పిట్ సెక్రెటరీ మురళీచౌదరీ, నాయకులు రామకృష్ణ, పూర్ణ చందర్ పాల్గొన్నారు.

'రుణమాఫీ పేరుతో ప్రభుత్వం మోసం'



మాట్లాడుతున్న కృష్ణమూర్తి

మంచిర్యాలటౌన్: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేస్తామని చెప్పి నిబంధనల పేరుతో కొందరికి మాత్రమే రుణ మాఫీ చేయడం రైతులను మోసగించడమేనని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎనగందుల కృష్ణమూర్తి అన్నారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులందరికీ రుణమాఫీని చేయడంలో ప్రభుత్వం విఫలం అయ్యిందని, అర్హులైన రైతులకు రుణమాఫీ చేయాలని బీజేపీ డిమాండ్ చేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు మాదవరపు వెంకటరమణారావు, ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకులు మోటపలుకుల తిరుపతి, ముదాం మల్లేశ్, కిసాన్ మోర్చా బీజేపీ నాయకులు పాల్గొన్నారు.